# పెరుగుతున్న సాగు విస్తీర్ణం

- యాసంగిలో వివిధ పంటల సాగు
- పెరిగిన భూగర్భ జలాలు



బోథ్: సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

బోథ్, డిసెంబర్ 10: యాసంగి సాగులో పంటల విస్తీర్ణం పెరుగుతున్నది. భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీరు సమృద్ధిగా వస్తుండడంతో అన్నదాతలు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 2022-23 యాసంగి సీజన్‌లో 11,628 ఎకరాల్లో శనగ, 3,260 ఎకరాల్లో జొన్న, 3,984 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను ప్రధానంగా సాగు చేశారు. ప్రస్తుతం 2023-24 యాసంగి సీజన్‌కు గాను ఇప్పటికే 10,500 ఎకరాల్లో శనగ, 3 వేల ఎకరా ల్లో మక్క, 1800 ఎకరాల్లో జొన్న పంటలు రైతులు వేశారు. యాసంగిలో విత్తనాలు వేయడానికి మరో యాభై రోజుల వరకు గడువు ఉండడంతో సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బోథ్, చింతల్‌బోరి, కంటెగాం, తదితర ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉండడంతో పాటు మర్లపెల్లి, పెద్దవాగు, ధన్నూర్ (బీ), సొనాల వా గుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో పాటు భూగర్భజాలు ఆశించిన విధంగా ఉండడంతో పాటు రైతులకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా అందుతుండడం తో పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా శనగ, మక్క, జొన్న పంటలు వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఒకటి, రెండు నీటి తడుల అవసరం తగ్గడం తో పత్తి ఏరడం పూర్తైన రైతులు ఆ పంట పొలాల్లో యాసంగి పంట వేయడాని కి దుక్కులు దున్నుతున్నారు. ఆరుతడి పంటలైన ఆవాలు, పెసర పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారు. మొత్తం మీద వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం, సాగు నీటి లభ్యతతో యాసంగిలో పంటల సాగు విస్తీర్ణం గతంలో కంటె పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



బోథ్: సాగవుతున్న శనగ పంట




సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా చైర్మన్ గుర్రం పున్నంరావు

## హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ఎదులాపురం,డిసెంబర్10: ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన పెంచుకోవాలని హ్యూమన్ రైట్స్ ఉమ్మడి జిల్లా చైర్మన్ గుర్రం పున్నంరావు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సార్క్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ జాతి, మత, లింగ వర్ణ బేధాలు లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ పీఆర్వో సురేశ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్ కిరణ్, జిల్లా చైర్మె న్ వెంకటపతిరాజు, మీడియా ఇన్‌చార్జి కేంద్ర లక్ష్మణ్,సభ్యులు చంద్రకాంత్, సారథి, ఎం. సంజయ్, ఎస్‌కే. మజార్, రఫిక్, అఖిల్ రెడ్డి, అజయ్ ఉన్నారు.

## బోథ్ ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



భీంపూర్: ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

భీంపూర్,డిసెంబర్10: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను ఆదివారం నేరడిగొండలో మండల బీఆర్ఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శ్రేణులు ప్రజలలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వానికి నివేదించే ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బక్కి సురేందర్‌యాదవ్, సంజీవ్‌రెడ్డి ,జహూర్‌అహ్మద్ , గోప మహేందర్, సర్పంచులు,ఎంపీటీసీలు , కార్యకర్తలు ఉన్నారు.

## స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 10 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ, సంవత్సరం కాలంగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం తమవంతుగా రోగుల సహాయకులు, పేదలు, నిస్సహాయుల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు భూరె సురేశ్, రామకృష్ణ, విశాల్, ఆకాశ్, రాహుల్, దయానంద్, దివ్య పాల్గొన్నారు.

## 13 న జాబ్ మేళా

ఎదులాపురం,డిసెంబర్10: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లా కార్యాలయంలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాల ఎంపికకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా ఉపాధి అధికారి కె.మిల్కా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల లోపు గల యువకులు అన్ని విద్యార్హత సర్టిఫికెట్లతో జిల్లా కార్యాలయానికి ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన యువకులకు ఆదిలాబాద్‌లోనే రూ.9వేల నుంచి రూ.12వేల వరకు జీతం ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 9133307724, 7659978443కు సంప్రదించాలన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోధ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 10 : ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మహిళా సాధికారత, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోధ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలు, హెల్ప్ లైన్ నంబర్స్, సైబర్ క్రైమ్, బాల్య వివాహల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగి పెంచుకోవాలని సూచించారు. సఖీ సిబ్బంది లావణ్య, నాగమణి పాల్గొన్నారు.

## బాలుడిపై కుక్క దాడి

ఇచ్చోడ, డిసెంబర్ 10: మండలకేంద్రంలో రెండు రోజుల నుంచి నలుగురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఆదివారం సాయిబాబా ఆలయం వద్ద రిత్విక్‌అనే బాలుడిపై కుక్కలు దాడి చేసి చేతిపై గాయపర్చాయి. గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామపంచాయతీ పాలక వర్గం దృష్టిసారించి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## గ్రామాల్లో పారిశుధ్య పనులు



కరంజ(టీ)లో పారిశుధ్య పనులు చేస్తున్న జీపీ సిబ్బంది

భీంపూర్, డిసెంబర్10: భీంపూర్ , కరంజి(టి), అంతర్గాం తదితర పం చా యతీల్లో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. మురికికాలువలు శుభ్రం చేసి క్లోరినేషన్ నిర్వహించారు. వాటర్ ట్యాంకులు శుభ్రం చేశారు. వాడల్లోని చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించారు. సర్పంచ్‌లు మడావి లింబాజీ, జి.స్వాతిక, బక్కి లలిత, కార్యదర్శులు సాయిచందన, నితిన్, నర్సయ్య పర్యవేక్షించారు.

# ట్రైయినీ ఎఫ్ఎస్‌వోలకు శిక్షణ



అర్లి అడవుల్లో శిక్షణ పొందుతున్న ఎఫ్ఎస్‌వోలు

భీంపూర్, డిసెంబర్ 10: మండలంలోని తాంసి (కె) ,అర్లి(టి) కోడిపుంజులదొడ్డి అటవీప్రాంతంలో శని,ఆదివారాలు ధూల్‌పేట్ నుంచి వచ్చిన కొత్త ఎఫ్ఎస్‌వోలకు శిక్షణ ఇచ్చారు. అటవీసంరక్షణ ,వన్యప్రాణులు, పులి సంరక్షణ, స్మగ్లర్ల నుంచి అడవిని కాపాడడం తదితర అంశాలలో డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్ ఆదేశాలతో ఎఫ్ఆర్వో గులాబ్, ఎఫ్ఎస్‌వో అహ్మద్‌ఖాన్ శిక్షణ ఇచ్చారు. మండలంలో దాదాపుగా 5 వేల హెక్టార్ల పరిధి విస్తీర్ణంలో పచ్చదనంతో కళకళలాడుతున్న అడవులను చూసి ట్రెయినీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. అడవుల్లో శాఖాహార జంతువులకు అవసరమైన గడ్డి మైదానాల పెంపకం,వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లు చూసి వివరాలు తెలుసుకున్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే 'ఆరోగ్యశ్రీ'

ఎదులాపురం,డిసెంబర్10: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య ఖర్చులకు రూ.10లక్ష వరకు పెంచారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్‌స్పెషాలిటీలో ఆరోగ్యశ్రీ వైద్య సహాయం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం(మహాలక్ష్మి)పథకాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఏర్పాటు చేసిన సమా వేశం లో ఆరోగ్యశ్రీ పథకం, మహలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం చేసిన వారి ఇచ్చే జీరో టికెట్ పోస్టులను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఆర్టీసీ ఆర్ఎం సోలెమాన్,డీఎం కల్పనలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచడం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ,మహాలక్ష్మి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రిమ్స్‌లో వైద్యులు, ఇతర పరికరాలు ,యంత్రాలు ఎన్ని అవసరమో రాష్ట్ర ప్రభుత్వంతో, మంత్రులతో మాట్లాడి తీసుకువచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం బస్సులో విద్యార్థులు, మహిళాలతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మావల చౌరస్తా,తిరిగి కలెక్టర్ చౌక్ నుంచి దవాఖాన వరకు ఎమ్మెల్యే ప్రయాణం చేశారు. ప్రయాణ సమయంలో ఎమ్మెల్యేతో పాటు ప్రయాణిస్తున్న మహిళా ఉద్యోగులు, విద్యార్థులకు జీరో చార్జీ టికెట్‌ను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీప వివేకనంద రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ ఇద్రిస్‌అక్రమ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, వార్డు కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్ కుమార్, జోగు రావి, కృష్ణాయాదవ్, నాయకులు భీంసేన్ రెడ్డి, చిక్కాల దత్తు,సతీశ్, తదితరులు ఉన్నారు.



ఎదులాపురం : జెండా ఊపి మహాలక్ష్మి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్